క్లుప్తంగా

విద్యుత్ అధికారుల 'పొలంబాట'



ఎడపల్లి: మండల కేంద్రంలోని పంట శివారులో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాల్లో, బోరు మోటార్ల వద్ద తీసుకోవాల్సిన విద్యుత్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణామృత ప్రాశన పంపిణీ



నందిపేట్: మండల కేంద్రంలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో బుధవారం 15 ఏళ్ల లోపు పిల్లలకు స్వర్ణామృత ప్రాశనను పంపిణీ చేశారు. ప్రతినెల పుష్యమ నక్షత్రం రోజున ఆశ్రమంలో పిల్లల్లో మేధాశక్తిని పెంపొందించేందుకు స్వర్ణామృత ప్రాశన మందులను వేస్తున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. అనేక దూరప్రాంతాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలకు స్వర్ణామృత ప్రాశన మందు వేయించారు.

మార్క్‌ఫెడ్ సమావేశంలో మానాల, రాజేశ్వర్



బాల్కొండ: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన వేదికలో బుధవారం నిర్వహించిన ఏపీసీఎస్, మార్క్‌ఫెడ్ జనరల్ సమావేశంలో కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ముప్కాల్ మండలం వేంపల్లి సహకార సంఘం చైర్మన్ జక్క రాజేశ్వర్ పాల్గొన్నారు. తమ పరిధిలోని సమస్యలపై సమావేశంలో విన్నవించినట్లు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాక్లూర్: గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై రాజశేఖర్ సూచించారు. మండలంలోని దాస్‌నగర్‌లో ఉన్న ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో మత్తుపదార్థాలపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారమే అవుతుందన్నారు. ప్రతి విద్యార్థి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డైరీల వితరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టులో ఉన్న న్యాయవాద బార్ అసోసియేషన్‌లో బుధవారం సంగారెడ్డి న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యులు నూతన డైరీలను వితరణ చేశారు. గత మూడేళ్లుగా నూతన సంవత్సర డైరీలను అందజేస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, సీనియర్ న్యాయవాదులు భూపతి రెడ్డి, రంగారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, విజయలక్ష్మి, గటడి ఆనంద్, ప్రవీణ్, సందీప్, అజిత్, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

ధర్మసమాజ్ పార్టీ దీక్ష భగ్నం.. అరెస్టు



నిజామాబాద్‌అర్బన్: అర్హులైన పేదలకు ఇళ్లు, భూమి కేటాయించాలని, ఉచిత వైద్యాన్ని అందించాలని జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ధర్మసమాజ్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు బుధవారం రాత్రి 8 గంటలకు భగ్నం చేసి అరెస్టు చేశారు. ఆమరణ నిరాహార దీక్షలో ఉన్న వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బీపీ షుగర్ లెవల్స్‌ను పరీక్షించారు.

చలికాలం..

ఎలక్ట్రానిక్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

సుభాష్‌నగర్: జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ప్రజలు చలి బారిన పడకుండా ఉండేందుకు ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, దుప్పట్లను వినియోగిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో మనిషి శరీరంలో భాగమైన సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వినియోగంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలక్ట్రానిక్ పరికరాలను 10 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే స్థలాల్లో ఉంచాలి.

- సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు అధిక వేడి, చలికి తట్టుకోలేవు. ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గుల వల్ల ఆటోమెటిక్‌గా హ్యాంగ్(బంద్) అవుతాయి.
- ముఖ్యంగా బ్యాటరీల సామర్థ్యం తగ్గిపోవడం, హార్డ్ డిస్క్‌లు చెడిపోవడం, టచ్ స్క్రీన్స్ పని చేయక పోవడం వంటి సమస్యలు ఉంటాయి.



- అధిక చలితో ఎలక్ట్రానిక్ వస్తువులు కుచించుకుపోయే(సింక్) తత్వాన్ని కలిగి ఉంటాయి.
- అధిక చలి, వేడి కారణంగా పరికరం ఆన్ కావడానికి కొంత సమయం పడుతుంది.

మన్నికగా ఉండాలంటే..

- ప్రతి ఇంట్లో ఎలక్ట్రానిక్ డివైజెస్ సర్వ సాధారణమయ్యాయి. అందులోనూ సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం అధికంగా ఉంది.
- సాధారణ ఉష్ణోగ్రతలు ఉండే ప్రదేశాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులను ఉంచాలి. తేమశాతం లేని స్థలాన్ని ఎంచుకోవాలి.
- ఎలక్ట్రానిక్ వస్తువులను ఆరు బయట ఉంచొద్దు.

– అనుముల విక్రమ్ రాజ్,
అమృత కంప్యూటర్స్ యజమాని



జోరుగా రేషన్ దందా

- మహారాష్ట్రకు తరలుతున్న బియ్యం
- పట్టించుకోని అధికారులు



బాల్కొండలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో పోలీసులు(ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రంలో రేషన్ దందా జోరుగా సాగుతోంది. పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం వివిధ మార్గాల్లో మహారాష్ట్రకు తరలుతోంది. కొందరు వ్యాపారులు మాఫియాగా ఏర్పడి వివిధ మార్గాల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం పోలీసులు 37క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కొందరు మండల కేంద్రం నుంచి బాల్కొండ, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల మండలాల పరిధిలోని గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కిలోకు రూ. 10 చొప్పున సేకరిస్తారు. అక్కడి నుంచి బాల్కొండలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వ్యాపారులకు కిలో రూ. 15కు విక్రయిస్తారు. ఇలా అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని వ్యాపారులు డీసీఎం వ్యానులలో మహారాష్ట్రకు కిలో రూ. 22 చొప్పున విక్రయిస్తున్నారు. ఇదంతా పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తన్నుకున్న వ్యాపారులు..

అక్రమంగా రేషన్ బియ్యం దందా చేసే వ్యాపారులు రెండేళ్ల క్రితం పాత జాతీయ రహదారిపై తన్నుకున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా వారు స్పందించలేదు. తీరా వారే రెండు వర్గాల మధ్య రాజీ కుదిర్చి మరి పంపారు. అంటే బాల్కొండలో ఏ స్థాయిలో రేషన్ అక్రమ దందా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. మండల కేంద్రంలో నాలుగు గ్రూపులు ప్రధానంగా ఏర్పడి దందాను సాగిస్తున్నాయి. నెల రోజుల క్రితం 30 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. అయినా వారిలో మార్పు రాలేదు. మళ్లీ దందాను జోరుగా సాగిస్తున్నారు.

దందాకు చెక్ పడేదెన్నడు..

రేషన్ బియ్యం పక్కదారి పట్టడంలో అధికారుల పాత్ర కూడా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో తేలడంతో దందాకు చెక్ పడటం లేదు. తమకు అడ్డుగా వచ్చే అధికారులకు వాటాలు చెల్లిస్తున్నామంటు మాఫియాగా ఏర్పడిన వ్యాపారులు బహిరంగంగా చెప్పడం గమనార్హం. పేదల బియ్యంపై పెద్దల కన్ను ఆగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఎలాంటి స్పందన ఇవ్వలేదు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



బూత్ కమిటీ అధ్యక్షులకు నియామకపత్రం అందజేస్తున్న సంతోష్

ఆర్మూర్‌టౌన్: బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి గంగోనే సంతోష్ అన్నారు. పట్టణంలోని రాజరాంనగర్ కాలనీలో 84వ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. మోదీ హయంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం నూతన బూత్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేష్, కార్యదర్శిగా సీహెచ్ రమణ ఎన్నికయ్యారు. వీరికి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పాల్కం వేణు, రఘు, సందీప్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



తరగతి గదిని పరిశీలిస్తున్న ఇంటర్ అధికారి

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్ అధికారి రవి కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని గోల్డెన్ జూబ్లీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం కళాశాల యాజమాన్యం, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం కార్యాలయ ఫైళ్లు, రిజిస్టర్లను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల డేటాను సరిచేసుకునేందుకు, సబ్జెక్టులు మార్చుకునేందుకు, ఫొటో, సంతకము తప్పిదం దొర్లితే సరిదిద్దుకోవడానికి ఇంటర్ బోర్డు మరో అవకాశం ఇచ్చిందని అన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న స్వప్న

బోధన్‌టౌన్: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కేంద్రలో యుక్త వయస్సులో ఉన్న విద్యార్థులకు ఇస్తున్న వృత్తి నైపుణ్యం, విద్యపై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ సమన్వయ కర్త స్వప్న అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మధుమలాంఛ జూనియర్ కళాశాలలో మహిళా శిశు, దివ్యాంగుల–వయోవృద్ధుల శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ సమన్వయ కర్త స్వప్న హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్య విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు పుష్ప, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కేంద్రం మేనేజర్ మహేశ్, మొబలైజర్ ప్రదీప్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో రాజగంగారాం

పెర్కిట్: విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం అన్నారు. పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఎంపీడీవో సాయిరాం మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల నైపుణ్యాలను పెంపొందించడానికి కాంప్లెక్స్ సమావేశాలు దోహద పడతాయని అన్నారు. కార్యక్రమంలో పిప్రి హెచ్‌ఎం విశ్వనాథ్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

పెర్కిట్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ బోధన చేపట్టాలని ఆలూర్ ఎంఈవో మేస నరేందర్ సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ నెలాఖరులో విద్యార్థులకు మిడ్‌లైన్ టెస్టు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఎంఈవోను హెచ్‌ఎంలు సన్మానించారు. కార్యక్రమంలో అశ్ఫాక్ అహ్మద్, రాంచందర్, శివ ప్రసాద్, హెచ్‌ఎంలు మురళి, రాజ సులోచన, రాజు, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్‌లో..

బాల్కొండ: ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలను వినియోగించుకోవాలని బాల్కొండ ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. మండలంలోని కిసాన్‌నగర్ పాఠశాలలో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో బోధించే బోధన ఉపకరణలను సిద్ధంగా చేసుకోవాలన్నారు. ప్రణాళిక బద్ధంగా బోధించాలన్నారు. హెచ్‌ఎం రాజేంద్ర కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోనాపూర్‌లో..

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ హైస్కూలులో బుధవారం కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, మోర్తాడ్ మండలాల గణితం ఉపాధ్యాయులకు స్కూలు కాంప్లెక్సు సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం రాంప్రసాద్ కార్యక్రమాన్ని పారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరి మోహన్, రిసోర్స్‌పర్సన్లు సతీశ్‌రెడ్డి, క్రాంతికుమార్‌లు ఈనెల 22న నిర్వహించే జాతీయ గణిత దినోత్సవం కార్యక్రమాలను వివరించారు.



ఆలూర్‌లో ఎంఈవోను సన్మానిస్తున్న హెచ్‌ఎంలు



కిసాన్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో



కోనాపూర్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసకొత్తూరు పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సీఎం కప్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బుస కృష్ణకుమార్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో 8వ తరగతికి చెందిన ప్రతిభ, సంగీత, ఉదయ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. దీంతో వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలో వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు.

పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ ఇచ్చిన పీడీ మాధురి, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసమూర్తి, నరేందర్, షేక్‌జాన్‌పాషా, శ్రీనివాస్, దాసు పాల్గొన్నారు.

బస్‌జాతను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆశా వర్కర్లు

రుద్రూర్: ఫిబ్రవరిలో నిర్వహించే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఆశా కార్యకర్తలకు రూ. 18 వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్ల బస్ జాత చేపట్టామని ఈనెల 19న నిజామాబాద్ జిల్లా కేంద్రానికి జాత చేరుకుంటుందని ఆశా కార్యకర్తలు తెలిపారు. బస్ జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం రుద్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వాణి, భూలక్ష్మి, రంజన, లక్ష్మి, గంగామణి, ప్రవళిక, శోభ, పుష్ప, నాగమణి, ప్రేమల, సునీత తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉర్దూ మీడియంలో చరిత్ర శాస్త్రం బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో 55శాతం మార్కులు, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈ నెల 20 లోపు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

లెదర్ పార్క్ స్థలాలను కాపాడాలి

ఆర్మూర్‌టౌన్: లెదర్ పార్క్ స్థలాలు అన్యాకాంతం అవుతున్నాయని వాటిని కాపాడేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మాదిగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న బుధవారం హైదరాబాద్‌లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను కలిసి కోరారు. తెలంగాణలో గత పదేళ్లుగా లెదర్ పార్కులు నిరుపయోగంగా ఉన్నాయని ఆ పార్కులో కేటాయించిన స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని అసెంబ్లీ సమావేశాల్లో లెదర్‌పార్కులపై మాట్లాడి వినియోగంలో తీసుకొచ్చి, స్థలాలు కబ్జాకాకుండా చూడాలని కోరారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	మిస్‌యూ (తెలుగు) - 11.00, 7.30 10.20 పని (తెలుగు) -1.50 ఫియర్- 4.55
స్క్రీన్-2 –	పుష్ప-2 (తెలుగు) - 10.15 2.20 6.25 10.30
స్క్రీన్-4 –	పుష్ప-2 (తెలుగు) -1.20 5.25 9.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-1.30,7.00
స్క్రీన్-2	పుష్ప-2-11.00,4.30, 10.00
స్క్రీన్-3	మిస్‌యూ(తెలుగు)-10.40,1.20, 7.50,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10,10.15
స్క్రీన్-2	ఫియర్(తెలుగు)-11.45 మిస్‌యూ(తెలుగు)-2.20 పుష్ప-2 (తెలుగు)-5.10,9.15
స్క్రీన్-3	ప్రణయ గోదారి(తెలుగు)-11.10 పుష్ప-2(హిందీ)- 2.20 6.25 10.30
స్క్రీన్ -4	పుష్ప-2(హిందీ)-10.00 పని(తెలుగు) -2.05 మిస్‌యూ-5.10 10.35 ఫియర్(తెలుగు)- 10.35
లలితామహల్	మిస్‌యూ (తెలుగు)
దేవి	పని(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,200	వెండి(కిలో)	94,200
22 క్యారెట్స్	73,075		

– నిజామాబాద్ బిజినెస్

నిబంధన ప్రకారం సర్వే చేపట్టాలి



ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రభుత్వ నిబంధన ప్రకారం సర్వే చేపట్టి యాప్‌లో వివరాలను నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 2, 9, 18, 24, 26వ వార్డులలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కమిషనర్ పరిశీలించారు. అధికారులు సేకరించిన వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి తప్పుడు వివరాలు నమోదు చేయవద్దని, చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గజనాంద్, ఉదయ్‌శ్రీ, వార్డు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో విద్యార్థిని ప్రతిభ



కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి హైస్కూల్ విద్యార్థిని సబా సాదియా జిల్లాస్థాయి బయాలాజికల్ టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరచి రెండో బహుమతి పొందినట్లు హెచ్‌ఎం, ఎంఈవో నేరఆంధ్రయ్య తెలిపారు. డీఈవో అశోక్ చేతుల మీదుగా రూ. 1000 నగదు బహుమతి, మెమెంటోను అందుకున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో అన్ని సబ్జెక్టుల్లో మొదటి స్థానంలో నిలవడంతో పాటు, గణితంలో జిల్లాస్థాయిలో మూడో బహుమతి పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు మగ్గిడి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల ధర్నా



రుద్రూర్: మండలంలోని మోడల్ స్కూల్ అధ్యాపకులు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలకు అందజేశారు. మోడల్ స్కూల్ అధ్యాపకులకు ప్రమోషన్లు ఇవ్వాలని, సకాలంలో వేతనాలు అందించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, మోడల్ స్కూల్‌లో ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేసేలా చర్యలు తీసుకునేలా చూడాలని అధికారులను కోరారు. ప్రిన్సిపాల్ సతీశ్, అధ్యాపకులు ఫిరోజ్, బలరాం, రాఘవేంద్ర, జ్యోతి, అనిల్, సాయికృష్ణ, సంతోష్, సోపాన్ తదితరులు పాల్గొన్నారు.